

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న బెల్లంపల్లి ఏరియా ఎస్ ఓ టు జి ఎం రాజమల్లు

## క్రీడల్లో గెలుపోటములు సాధారణం

రెబ్బెన, సెప్టెంబర్ 15 : క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమని బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజమల్లు స్పష్టం చేశారు. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ వార్షిక క్రీడల్లో భాగంగా బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌సిప్‌లో గల సీఈఆర్ క్లబ్‌లో ఆదివారం చెస్, క్యారమ్స్, కల్చరర్ క్రీడలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌వోటూ జీఎం రాజమల్లు క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు. శారీరక దారుఢ్యానికి ఉపయోగపడతాయన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో రాణించి, పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్ బాబు, జనరల్ కేప్టెన్ చంద్రకుమార్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సీలాలు

## నగదు చోరీ కేసులో ఒకరి అరెస్ట్

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 15 : హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారులను, సిబ్బందిని మోసం చేసి రూ.50 వేలతో ఉడాయించిన కేసులో మహారాష్ట్రకు చెందిన రోహిత్ బాబూలాల్ ప్రకాశ్‌ను అరెస్టు చేసినట్లు మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు రోహిత్ బాబూలాల్ ప్రకాశ్ వచ్చి.. క్యాష్ కౌంటింగ్ మిషిన్ రిపేర్ చేస్తానని, ఏదైనా పని ఉంటే ఇప్పించండని అధికారులను కోరాడు. క్యాష్ కౌంటింగ్ మిషిన్ బాగు చేయాలని చెప్పడంతో కొద్దిసేపు బాగు చేస్తున్నట్లు నటించాడు. మిషిన్ చెక్ చేసేందుకు రూ.50 వేలు ఇవ్వాలని క్యాషియర్ నుంచి తీసుకున్నాడు. డబ్బు లెక్కిస్తున్నట్టు బ్యాంక్ అధికారుల దృష్టిని మళ్లించి, నగదుతో పారిపోయాడు. దీంతో బ్యాంక్ అధికారులు మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిని మంచిర్యాలలో పట్టుకున్నారు. విచారించగా, మహారాష్ట్రకు చెందిన రోహిత్ బాబూలాల్ ప్రకాశ్‌గా గుర్తించారు. సికింద్రాబాద్‌లో కుటుంబంతో నివాసముంటూ సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకున్నాడని, అనంతరం తండ్రి, అన్నతో కలసి నిజామాబాద్‌లోని పోలీస్‌స్టేషన్లలో ప్రింటింగ్, జిరాక్స్ మిషిన్లను బాగుచేసేవాడని సీఐ తెలిపారు. కొద్ది రోజుల తర్వాత తండ్రి, అన్నయ్య అనారోగ్యం చనిపోవడంతో అప్పటి ఖాళీగా ఉంటున్నాడని, తనకు తెలిసిన సాంకేతిక పరిజ్ఞానంతో మోసగించి డబ్బు కాజేయాలని ప్లాన్ చేసుకున్నాడని వివరించారు. రోహిత్ బాబూలాల్ ప్రకాశ్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

# రెండు నెలల్లో సింగరేణి ఈ-ఆఫీస్

- ఆన్‌లైన్‌లో ఉద్యోగుల బదిలీలు.. విజ్ఞప్తుల స్వీకరణ
- సింగరేణి సీఎండీ బలరాం
- పర్సనల్ విభాగం పనితీరుపై సమీక్ష

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 15 : సింగరేణిలో పేపర్ రహిత కార్యకలాపాలు నిర్వహించేందుకు వీలుగా రెండునెలల్లో ఈ-ఆఫీస్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు సీఎండీ ఎన్ బలరాం తెలిపారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఆదివారం పర్సనల్ విభాగం పనితీరుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారుల బదిలీ విషయంలో ప్రత్యేక పాలసీ ఉందని, కానీ 40 వేల మంది కార్మికుల కోసం ఇప్పటి వరకు బదిలీ విధానం లేదన్నారు. దీనిపై త్వరలోనే ట్రాన్స్‌ఫర్ పాలసీ విధానాన్ని రూపొందించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా బదిలీ విధానాన్ని రూపొందించాలని సూచించారు. ఏడాదిలో నిర్ణీత నెలల్లోనే బదిలీల ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా ఉత్పత్తిపై ప్రభావం ఉండదన్నారు. అలాగే సంస్థలో మరింత పారదర్శకత పెంచేందుకు వీలుగా ఆన్‌లైన్ ద్వారా బదిలీ విజ్ఞప్తులు, ఇతర వినతుల స్వీకరణకు ప్రత్యేక అప్లికేషన్‌ను రూపొందించాలని ఐటీ విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. దీని వల్ల ఉద్యోగులకు అత్యంత సౌలభ్యంగా ఉంటుందని, సుదూర ప్రాంతాల నుంచి విజ్ఞప్తి పత్రాలతో ఉద్యోగులు కార్పొరేట్ కార్యాలయాలకు రావడం తగ్గుతుందని, పారదర్శకత పెరుగుతుందని వెల్లడించారు. కొత్త ఉద్యోగాల్లో చేరిన బదిలీ వర్కర్లు డ్యూటీలకు గైర్హాజరు ఎక్కువగా అవుతున్నారని, దీనిపై దృష్టిపెట్టాలని, వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని, తద్వారా ఉత్పాదకత పెంపునకు కృషి చేయాలని సూచించారు. మహిళా ఉద్యోగుల సేవలను గనుల్లో సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా రక్షణ విధానాలను (ఎస్‌ఓపీ) రూపొందించాలని స్పష్టం చేశారు. సింగరేణిలో 39 గనుల్లో కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు చర్యల తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు సత్యనారాయణరావు, వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం కోఆర్డినేషన్ సుభానీ, జీఎం మార్కెటింగ్ రవిప్రసాద్, జీఎం సుధాకర్, కవితానాయుడు, సురేశ్‌బాబు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాం

# రైతాంగ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

సీసీసీ నస్పూర్, సెప్టెంబర్ 15 : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు లింగం రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవాలను ఆదివారం నస్పూర్, తాళ్లపల్లి గ్రామ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నస్పూర్‌లో లింగం రవి, షిర్కె సెంటర్‌లో మిర్యాల రాజేశ్వర్‌రావు, తాళ్లపల్లిలో జోగుల మల్లయ్య పార్టీ జెండాలను ఆవిష్కరించారు. సాయుధ పోరాట విలీనాన్ని కాంగ్రెస్ ప్రభుత్వ అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొడ్డిపట్ల రవీందర్, మోత్కూరు కొమురయ్య, చిలుక రాంచందర్, సంఘం సదానందం, కోడి వెంకటేశ్, గుడెల్లి రాజయ్య, దాడి రాజయ్య, శాఖపురం భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

### సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

మందమర్రి, సెప్టెంబర్ 15 : 76వ తెలంగాణ రైతాంగ పోరాట వార్షికోత్సవ వేడుకలను భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ), సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఐటీయుసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య జెండా ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు, కార్యకర్తలతో కలసి అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. తెలంగాణ ప్రాంతంలో దున్నేవాడికే భూమి కావాలని పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సలేంద్ర సత్యనారాయణ, భీమనాథుని సుదర్శన్, కామెర దుర్గరాజ్, శ్రీనివాస్ శర్మ, రాజేశం, జనార్ధన్, ఓంనారాయణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే రామకృష్ణాపూర్‌లో రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం ఎదుట సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, అనంతరం పట్టణంలోని పలు కూడళ్లలో నాయకులు పతాకాలను ఆవిష్కరించారు.



మందమర్రి సీపీఐ కార్యాలయం ఎదుట పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య

## పరీక్షా తేదీలు ప్రకటించాలి

శ్రీరాంపూర్, సెప్టెంబర్ 15 : సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ నియామక పరీక్షా తేదీని వెంటనే ప్రకటించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) శ్రీరాంపూర్ డివిజన్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి అంబాల శ్రీనివాస్, కోశాధికారి కస్తూరి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జూనియర్ అసిస్టెంట్ నోటిఫికేషన్ ఇచ్చారని, దరఖాస్తులు తీసుకొని పరీక్షా తేదీలను ప్రకటించడం లేదని పేర్కొన్నారు. వెంటనే పరీక్ష తేదీని ప్రకటించాలని సింగరేణి వ్యాప్తంగా ఉన్న మినిస్ట్రీయల్ స్టాఫ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరారు. క్లరికల్ స్టాఫ్‌నకు వెంటనే నూతన కుర్చీలు ఏర్పాటు చేయాలని, ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని, పాతకాలపు ప్రింటర్ల స్థానంలో కొత్త డిజిటల్ ప్రింటర్లు, స్కానర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. సీఎంపీఎఫ్ చిట్టీలు సకాలంలో ఇప్పించేలా చూడాలని కోరారు.



గణేశ్ నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్నా సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

## ఆటంకాలు జరిగితే చర్యలు తప్పవు

కాగజ్‌నగర్, సెప్టెంబర్ 15 : గణనాథుడి నిమజ్జనం సందర్భంగా ఆటంకాలు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే చర్యలు తప్పవని కాగజ్‌నగర్ డివిజన్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అధికారులను హెచ్చరించారు. కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగు గణనాథుల నిమజ్జ స్థలాన్ని పరిశీలించి, అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆశించిన స్థాయిలో మున్సిపల్, సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీలాదర్ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 35 శాతం వాటా చెల్లించాలి

బెల్లంపల్లి, సెప్టెంబర్ 15 : సింగరేణి సంస్థ సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి, కార్మికులకు 35 శాతం వాటా వెంటనే చెల్లించాలని టీఎస్టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరామ్‌సింగ్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు సంస్థ సాధించిన లాభాలను ప్రకటించలేదన్నారు. గతంలో కంటే ఈ ఆర్థిక సంవత్సరంలో రికార్డుస్థాయిలో కార్మికులు ఉత్పత్తి సాధించారని, లాభాల వాటా 35 శాతం వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంస్థ చైర్మన్ ప్రకటించిన హామీ మేరకు కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా, దసరా అడ్వాన్స్ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు గద్దల నారాయణ, జీవరత్నం, బుల్లు మల్లయ్య, సీ హెచ్ రమేశ్, ఆర్ గంగాధర్ గౌడ్, ఎస్ పాండే, ఎండీ హసన్, ఏ కుమార్, కాసర్ల వెంకటేశ్, కొంత యాదగిరి, ఎం రాజయ్య, ఎం గోపాల్, బింగి సత్యనారాయణ పాల్గొన్నారు.

## మోక్షగుండం అడుగుజాడల్లో నడవాలి

రెబ్బెన సెప్టెంబర్ 15 : ఇంజినీర్లకు ఆదర్శప్రాయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని, ఆయన అడుగుజాడల్లో నడిచి పేరు సంపాదించుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ప్రాజెక్టు ఇంజినీర్ వీరన్నను సన్మానించారు. బెల్లంపల్లి ఏరియా ఎస్‌వోటూజీఎం రాజమల్లు పీవో నరేందర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, ఏరియా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారికి ఘన వీడ్కోలు

పెంచికల్ పేట్, సెప్టెంబర్ 15 : పెంచికల్‌పేట్ మండల వ్యవసాయాధికారిగా సేవలు అందించిన ఏడీఏ రాజుల నాయుడుకు ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. నాయకులు, ఫర్టిలైజర్ దుకాణ నిర్వాహకులు ఆయనను శాలువాలతో సన్మానించి, జ్ఞాపకలు అందజేశారు. అలాగే క్లస్టర్ వారీగా బదిలీ అయిన ఏఈవోలు శ్రీవిద్య, లావణ్యను సన్మానించారు. మాజీ సర్పంచులు శ్రీనివాస్, సంజీవ్, రాజన్న, సుధాకర్, మండల మాజీ కో-ఆప్షన్ సాజిత్ నాయకులు తిరుపతి, రాజన్న, కృష్ణ, బండు, వెంకటాచలం, శ్రీనివాస్, రాజేశ్వర్, శ్రీనివాస్, రమేశ్, బాపురావు, ఇస్తారి పాల్గొన్నారు.

